https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 340 గురువారం 26-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## ధాన్యం కుంభకోణంలో

# దంపతుల అరెస్టు

**రూ.42.80 కోట్ల ధాన్యం అక్రమంగా విక్రయం..**

**అక్రమ దందాలో ఏడుగురు వ్యాపారులు**




**నల్లగొండ, ఫిబ్రవరి 25**
నల్లగొండ జిల్లాలో రూ.190 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని కాజేసిన వ్యవహారంలో ఏడు మిల్లుల నిర్వాహకులపై కేసులు నమోదుకాగా, నల్లగొండకు చెందిన వ్యాపారి మహేందర్, అతని భార్య పద్మను పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా విక్రయించడాన్ని తీవ్ర నేరంగా పరిగణిస్తూ మహేందర్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారి కందుకూరి మహేందర్, అతని భార్య పద్మతో పాటు మరో అయిదుగురు కలిసి నల్లగొండ పట్టణంలోని సుమాంజలి రైస్ మిల్, చిట్యాలలోని వరలక్ష్మి పార్‌బాయిల్డ్ రైస్‌మిల్, మునుగోడులోని మనోహర ఆగ్రోఫుడ్ ప్రొడక్ట్స్ రైస్‌మిల్లులను నిర్వహిస్తున్నారు. వీరు 2022-23 యాసంగి సీజన్ ధాన్యానికి సంబంధించి రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌తో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిమిత్తం ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు మూడు రైస్‌మిల్లులు కలిపి సీఎంఆర్ కింద ఇవ్వాల్సిన రూ.42.80కోట్ల విలువైన 13,170.061 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌కు నిర్ణీత గడువులోగా ఇవ్వలేదు. పైగా ఈ ధాన్యాన్ని తమ మిల్లుల్లో నిల్వ లేకుండా అక్రమంగా విక్రయించుకున్నారని సివిల్ సప్లయీస్ విజిలెన్స్ కమిటీ సైతం నిర్ధారించింది. ఈ మూడు మిల్లుల నిర్వాహకులైన కందుకూరి మహేందర్, కందుకూరి పద్మ, మాశెట్టి రాధాకృష్ణ, మేడం కృష్ణమూర్తి, ఇడుకుళ్ల దామోదర్, కందుకూరి రవికుమార్, బూరుగు బాలకృష్ణపై నల్లగొండ రూరల్, చిట్యాల, మునుగోడు పోల?సస్టేషన్లలో సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ అధికారులు ఈ నెల 23వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా ఎస్పీ శరత్‌చంద్రపవార్ నేతృత్వంలో పోలీసులు కేసు విచారణ చేపట్టి నిందితుల్లో ప్రధాన పాత్రధారి కందుకూరి మహేందర్, అతని భార్య పద్మను బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.09 లక్షల నగదు, మూడు మొబైల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మహేందర్‌పై నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేయగా, ఇతర నిందితులపై నిత్యావసర వస్తువుల చట్టం-1955లోని సెక్షన్(7)తో పాటు, బీఎన్ఎ?స చట్టంలోని 316/2, 316/5, 318/4, 318/3 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మహేందర్ దంపతులతో కలిసి ఈ అక్రమ దందాల్లో భాగస్వాములైన మరో అయిదుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.



**హైదరాబాద్, ఫిబ్రవరి 25 :**
దేశవ్యాప్తంగా యువతను కబళిస్తున్న అతిపెద్ద ముప్పుగా డ్రగ్స్ మారుతున్నాయి. ఒకప్పుడు అంచులకే పరిమితమైన మత్తు పదార్థాలు నేడు పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా విద్యార్థుల జీవితాల్లోకి చొచ్చుకొస్తున్నాయి. చదువు, ఉద్యోగం, లక్ష్యాలు అనే మాటలు వెనక్కి నెట్టబడుతూ, క్షణిక ఆనందం పేరుతో యువత తమ భవిష్యత్తును తామే కాల్చుకుంటున్న దృశ్యం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. డ్రగ్స్ బారిన పడుతున్న యువతలో ఎక్కువ మంది మొదటిసారి మత్తును "ట్రై చేయడమే" అని భావిస్తున్నారు. స్నేహితుల ఒత్తిడి, పార్టీల సంస్కృతి, సామాజిక మాధ్యమాల్లో కనిపించే తప్పుడు గ్లామర్‌ఇవన్నీ కలిసి మత్తు పదార్థాలను సాధారణ విషయంలా చూపిస్తున్నాయి. ఒకసారి అలవాటు పట్టిన తర్వాత బయటపడటం ఎంత కష్టమో అనుభవించే వరకు ఎవరికీ అర్థం కావడం లేదు.ఈ మత్తు వ్యసనం వ్యక్తిగత సమస్యగా మాత్రమే మిగలడం లేదు. కుటుంబాలను చీల్చేస్తోంది, చదువులను మధ్యలో ఆపేస్తోంది, నేరాలకు దారి తీస్తోంది. డ్రగ్స్ కోసం డబ్బు అవసరమై చిన్న చిన్న తప్పులు, ఆపై పెద్ద నేరాలు జరిగే పరిస్థితులు పెరుగుతున్నాయి. యువత చేతుల్లో డ్రగ్స్ ఉంటే, సమాజం చేతుల్లో భద్రత ఉండదన్న భయానక వాస్తవం నేడు స్పష్టంగా కనిపిస్తోంది.గ్రామీణ ప్రాంతాలూ ఇప్పుడు ఈ ముప్పు నుంచి తప్పించుకోలేకపోతున్నాయి. పట్టణాల నుంచి గ్రామాలకు డ్రగ్స్ నెట్‌వర్క్ విస్తరిస్తోంది. పేదరికం, నిరుద్యోగం, నిరాశఈ మూడు కలిసి యువతను మత్తు వైపు నెట్టేస్తున్నాయి. ఉపాధి అవకాశాలు లేక, దారి చూపించే వ్యవస్థ బలహీనపడితే డ్రగ్స్ వారికి తాత్కాలిక తప్పించుకునే మార్గంగా కనిపిస్తోంది.డ్రగ్స్‌ను ఎదుర్కోవడం కేవలం పోలీస్ చర్యలతో సాధ్యం కాదు. ఇది సామాజిక యుద్ధం. కుటుంబం మొదటి గోడగా నిలవాలి. పిల్లలతో మాట్లాడే సంస్కారం, వారి మనసులో జరిగే మార్పులను గమనించే శ్రద్ధ తల్లిదండ్రుల్లో పెరగాలి. పాఠశాలలు, కళాశాలలు కేవలం పాఠాలు చెప్పే కేంద్రాలుగా కాకుండా, జీవిత విలువలు నేర్పే వేదికలుగా మారాలి.ప్రభుత్వాలు డ్రగ్స్ సరఫరాపై కఠినంగా వ్యవహరించడమే కాకుండా, పునరావాస కేంద్రాలు, కౌన్సిలింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలి. డ్రగ్స్ బారిన పడిన యువతను నేరస్తులుగా కాకుండా, మార్గం తప్పిన పిల్లలుగా చూసే దృక్పథం అవసరం. వారిని తిరిగి సమాజంలోకి తీసుకొచ్చే ప్రయత్నమే నిజమైన పరిష్కారం.యువతే దేశానికి బలం. అదే యువత మత్తుకు బానిసైతే దేశ భవిష్యత్తు చీకట్లోకి వెళ్లినట్లే. "డ్రగ్స్ వద్దు - జీవితం కావాలి" అనే స్పష్టమైన సందేశం ప్రతి వీధిలో, ప్రతి తరగతి గదిలో, ప్రతి ఇంట్లో మారుమోగాల్సిన సమయం ఇది. లేకపోతే, రేపటి సమాజం మనల్ని క్షమించదు.

# డ్రగ్స్ మత్తులో యువత

- యువత చేతుల్లో డ్రగ్స్
- సమాజం ఎటు వెళ్తోంది?
- పాఠశాలలు, కళాశాలల వరకూ చొచ్చుకొస్తున్న మత్తు వల
- స్నేహం పేరుతో పరిచయం అలవాటు పేరుతో బానిసత్వం
- కుటుంబాలు, భవిష్యత్తును మింగేస్తున్న నిశ్శబ్ద విషం



# ఇంటర్ పరీక్షలకు

# తొలిరోజు 96.90శాతం హాజరు

**తొలిరోజు పరీక్ష రాయని విద్యార్థులు 15,903 మంది**

**తొలిరోజు పరీక్ష ప్రశాంతం: ఇంటర్‌బోర్డు**

**హైద్రాబాద్, ఫిబ్రవరి 25 :**
ఇంటర్మీడియట్‌వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం ద్వితీయ భాష పరీక్షకు 5,14,598 మంది హాజరు కావాల్సి ఉండగా.. 4,98,695 (96.90శాతం) మంది హాజరయ్యారు. 15,903 మంది హాజరు కాలేదు. తొలిరోజు పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసు కూడా నమోదు కాలేదని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. బుధవారం ఆయన సికింద్రాబాద్, మారేడుపల్లి ప్రాంతాల్లోని పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు బోర్డు జారీచేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 75 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 200 సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు, 1,495 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 1,495 మంది వివిధ శాఖల అధికారులు పాల్గొంటున్నారని కృష్ణ ఆదిత్య వెల్లడించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తొలిరోజు పరీక్షకు 85,690 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, హైదరాబాద్ శివార్లలోని బాచుపల్లి-మల్లంపేట్ రోడ్డులో బుధవారం ఇంటర్ పరీక్షా పత్రాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. దీంతో మల్లంపేట్ ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష 15 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది.

**సంస్కృతానికి బదులు హిందీ ప్రశ్నపత్రం**

సంస్కృతం పరీక్ష రాయాల్సిన విద్యార్థికి హిందీ ప్రశ్నపత్రం ఇచ్చిన ఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో చోటుచేసుకున్నది. పట్టణంలోని ఓ ప్రైవేట్‌కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మణిదీప్ అనే విద్యార్థికి స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం కేటాయించారు.



మొదటి రోజు తెలుగు, హిందీ, అరబిక్, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు నిర్వహించగా.. సంస్కృతం పరీక్ష రాయాల్సిన మణిద?పకు ఇన్విజిలేటర్ హిందీ ప్రశ్నపత్రం ఇచ్చారు. సంస్కృత ప్రశ్నపత్రాన్ని హిందీ భాషలోనే ఇస్తారేమోనని భ్రమపడి.. ఆ విద్యార్థి హిందీ ప్రశ్నపత్రంలోని ప్రశ్నలకు సంస్కృతంలో జవాబులు రాశాడు. పరీక్ష పూర్తయిన అనంతరం ఇంటికి వెళ్లి తన తండ్రి యాదయ్యకు ఈ విషయం చెప్పాడు. యాదయ్య వెంటనే మణిద?పను వెంటబెట్టుకొని పరీక్ష కేంద్రం వద్దకు వెళ్లి చీఫ్ సూపర్‌వైజర్ అరుణ, ఏసీఎస్ ఆంజనేయులు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ కరణ్‌జీరావులను నిల దీశారు. దీంతో పొరపాటు జరిగినట్లు పరీక్ష కేంద్రం అధికారులు గుర్తించి.. డీఐఈవో, డీఈసీల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ కోసం సీఎస్, ఏసీఎస్, డీవో, విద్యార్థి, విద్యార్థి తండ్రిని మహబూబ్‌నగర్‌కు రావాలని సూచించడంతో వారంతా అక్కడికి వెళ్లారు. కాగా, ఇన్విజిలేటర్ పొరపాటు వల్ల తన కుమారుడికి ఒక సంవత్సర కాలం వృథా కానుందని యాదయ్య ఆవేదన వ్యక్తంచేశారు.

## మార్కెట్ యార్డుల్లో వసతులు సమకూర్చాలి: తుమ్మల

**హైదరాబాద్, ఫిబ్రవరి 25**



రాష్ట్రంలో అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతుల ఉత్పత్తులకు నష్టం కలగకుండా సంరక్షించేందుకు పాలకవర్గాలు, ఆ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల రాకపోకలు అధికంగా సాగుతున్న దృష్ట్యా, ఆకస్మిక వాతావరణ మార్పులు, అధిక తేమ, పురుగు సమస్యలు, అగ్ని ప్రమాదాలు, ఇతర సమస్యలతో మౌలిక సదుపాయాల పరంగా తాత్కాలిక నిల్వ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదాములు, కవర్ షెడ్లు అందుబాటులో ఉంచాలని, టార్పాలిన్లు ఉచితంగా అందించాలని, ఉత్పత్తులను నేరుగా నేలపై నిల్వ చేయకుండా చెక్క పలకలు, ఎత్తైన వేదికలపై ఉంచాలని ఆయన సూచించారు.

## ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు


**తరెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25**
రాష్ట్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తొలి దశలో అద్దె భవనాల్లో ఉన్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలు కలిపి 65 కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని చెప్పారు. రెండో విడతలో శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి బుధవారం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖ నుంచి ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు వీలుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నామని ఈ సందర్భంగా అన్నారు. నూతన భవనాలన్నీ ఒకే నమూనాలో ఉండేలా డిజైన్ చేయిస్తామన్నారు.

# హైకోర్టు ఆదేశించినా పంపరా?

**మా బదిలీలు రద్దు చేయండి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25**
: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(టీజీశాక్స్) పరిధిలో జిల్లాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను కొద్ది నెలల క్రితం నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(న్యాకో) నిబంధనల ప్రకారం రాష్ట్రాల పరిధిలోని జిల్లాల్లో పనిచేసే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను బదిలీ చేయకూడదు. కానీ నాటి టీశాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్న వాసం వెంకటేశ్వర్లు జిల్లాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను బదిలీ చేశారు. దీనిపై వారు హైకోర్టును ఆశ్రయించారు. న్యాకో నిబంధనలకు విరుద్ధంగా తమను బదిలీ చేశారని, తక్షణమే రూల్స్ ప్రకారం తమ తమ



స్థానాల్లో కొనసాగించాలని కోరారు. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం నిబంధనల మేరకు బదిలీలు చెల్లవని, తిరిగి వారిని ఎక్కడి నుంచి బదిలీ చేశారో అక్కడికి పంపాలని ఆదేశించింది. అయితే అలా రూల్స్‌కు వ్యతిరేకంగా బదిలీ అయిన వారందర్నీ తిరిగి వారి సొంత జిల్లాలకు పంపాలని హైకోర్టు ఆదేశించినా టీశాక్స్ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని కాంట్రాక్టు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబరు నెలలో అప్పటి పీడీ తమను బదిలీ చేశారని, అది న్యాకో నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. తిరిగి తమ సొంత ప్లేసులకు పంపాలని విజ్ఞప్తి చేసినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో తామంతా హైకోర్టును ఆశ్రయించామని వెల్లడించారు. హైకోర్టు తమను సొంత జిల్లాలకు పంపాలని టీశాక్స్ పీడీని ఆదేశించినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే టీశాక్ పీడీ హైకోర్టు ఆదేశాలను గౌరవించి గతంలో బదిలీ అయిన వారిని తిరిగి సొంత జిల్లాలకు పంపాలని విజ్ఞప్తి చేశారు.

# హంతకులను అరెస్ట్ చేయాలి

**కేటీఆర్- బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ**

**- పది లక్షలతో ఇల్లు నిర్మాణం.. తక్షణ సహాయంగా లక్ష రూపాయలు**

**- హత్యానేరం కింద కేసులు నమోదు చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్**





**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన దారుణ ఘటనలో మృతి చెందిన రెండు నెలల పసిపాప కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఆయన, పది లక్షల రూపాయలతో ఇల్లు కట్టిస్తామని ప్రకటించారు. తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న వివిధ వర్గాల నాయకులు, కార్యకర్తలను కలిసి సంఘీభావం తెలిపారు. కుమ్మెరలో జరిగిన ఈ ఘటన తెలంగాణ సమాజం మొత్తం తలదించుకునేలా చేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పసిపాప హంతకులకు అండగా నిలబడే ప్రతి ఒక్కరూ దోషులేనని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అయినా, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఎవరైనా సరే హంతకులకు మద్దతు ఇవ్వడం పూర్తిగా తప్పని కేటీఆర్ అన్నారు. హంతకుడు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన ఎనిమిది మందిపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పసిపాపను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించి జైల్లో వేయాలని, అవసరమైతే ఉరిశిక్ష విధించాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ట్యాంక్‌బండ్‌పై ఆత్మహత్యాయత్నం అడ్డుకున్న పోలీసులు

**కుటుంబ కలహాలతో మహిళ తీవ్ర మనస్తాపం -ఇద్దరు కుమారులతో హుస్సేన్‌సాగర్‌లో దూకేందుకు యత్నం**

**అప్రమత్తంగా వ్యవహరించిన పోలీసులు ప్రాణాలు కాపాడారు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 24**

కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఘటన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై చోటుచేసుకుంది. గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తంగా స్పందించడంతో ముగ్గురి ప్రాణాలు నిలిచాయి. జియాగూడ ఎంసీహెచ్ కాలనీకి చెందిన బి. ప్రతివ (28) తన కుమారులు అనిష్ (10), జస్వంత్ (7)తో కలిసి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంది. తెలంగాణ అమరవీరుల స్థూపం సమీపంలో వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని ప్రశ్నించారు. విచారణలో భర్తతో తరచూ గొడవలు జరుగుతున్నాయని, విసిగిపోయి పిల్లలతో కలిసి హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించింది. వెంటనే స్పందించిన పోలీసులు తల్లీకుమారులను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య ఆమె సమస్యలను శ్రద్ధగా విని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తదుపరి చర్యల కోసం వారిని కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.పోలీసుల సకాల స్పందనతో మూడు ప్రాణాలు నిలిచాయని అధికారులు తెలిపారు. కుటుంబ సమస్యలతో బాధపడుతున్న వారు ఆత్మహత్య వంటి దారుణ నిర్ణయాలు తీసుకోకుండా స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు అద్దె భవనాలకు చెక్

**తొలి దశలో 65 కార్యాలయాలకు నిర్మాణం- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే ప్రభుత్వ లక్ష్యం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25**

రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్, ఉప విభాగాధికారి కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరికాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే దృష్టితో ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించామని చెప్పారు. మొదటి దశలో ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఉప విభాగాధికారి కార్యాలయాలకు సకల వసతులతో కూడిన శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. రెండో దశలో శిథిలావస్థలో ఉన్న 170 కార్యాలయాలను పునర్నిర్మించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాలు ఒకే నమూనాలో, ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా రూపకల్పన చేయాలని చర్చించారు. స్టాంపులు మరియు నమోదు శాఖలో ఆధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు.



గచ్చిబౌలి, మేడ్చల్, పఠాన్ చెరువు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, గచ్చిబౌలి భవనం తుది దశలో ఉందని వెల్లడించారు.గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా మండలాలు విభజించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొత్త మండలాలకు అవసరమైన సిబ్బందిని కేటాయించి సేవలను బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

**ప్రతి మహిళకు 2,500 రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్**

**కరీంనగర్ కలెక్టరేట్ ముందు తెలంగాణ జాగృతి ధర్నా- మిగతా హామీలను కూడా నెరవేర్చాలని విజ్ఞప్తి**

**కరీంనగర్, ఫిబ్రవరి 25**

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు నెలకు 2,500 రూపాయల నగదు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరుతూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మహిళల సంక్షేమం కోసం పలు హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ వాటి అమలులో ఆలస్యం చేస్తోందని విమర్శించారు. మహిళల ఆర్థిక భద్రత కోసం 2,500 రూపాయల సహాయం కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా గ్యాస్, ఉపాధి,




విద్య, స్వయం సహాయక బృందాలకు సంబంధించిన హామీలను కూడా పూర్తిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళల అభ్యున్నతికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆందోళనకారులు విజ్ఞప్తి చేశారు. ధర్నాలో తెలంగాణ జాగృతినాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## నల్గొండలో తాగుబోతుల వీరంగం

**ఇంట్లో నుంచి యువకుడిని లాక్కొచ్చి దాడి**

**దాడి వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం**

**కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం**

నల్గొండ, ఫిబ్రవరి 25

: నల్గొండ జిల్లాలో అర్ధరాత్రి తాగుబోతుల వీరంగం కలకలం రేపింది. నిడుమనూరు గ్రామంలో మద్యం మత్తులో ఉన్న ఓ రౌడీ గ్యాంగ్, ఒక యువకుడిని ఇంటి నుంచి బలవంతంగా లాక్కొచ్చి విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం ప్రకారం, దుండగులు యువకుడిని కాళ్లతో తన్నుతూ, పిడిగుద్దులు గుద్దుతూ దారుణంగా కొట్టారు. ఈ దాడిని వీడియోగా చిత్రీకరించి సోషల్ మీడియాలో అప్లోడ్ చేసినట్లు తెలుస్తోంది. తమ జోలికి వస్తే ఎవరికైనా ఇదే గతి పడుతుందని బెదిరింపులు కూడా చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. వీడియో ఆధారంగా నిందితుల గుర్తింపుపై దృష్టి సారించారు. గ్రామంలో శాంతిభద్రతలు కాపాడేందుకు అదనపు బలగాలను మోహరించినట్లు సమాచారం. దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## ప్రపంచ స్థాయి సౌకర్యాలతో కరీంనగర్ రైల్వే స్టేషన్

**అత్యాధునిక సదుపాయాలతో పునరాభివృద్ధి పూర్తి**

**రూ.25.85 కోట్ల వ్యయంతో నిర్మాణం- ప్రయాణికులకు మెరుగైన అనుభవం**




**కరీంనగర్, ఫిబ్రవరి 25**

తెలంగాణలోని కరీంనగర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రపంచ స్థాయి అత్యాధునిక సౌకర్యాలతో స్టేషన్ రూపు సంతరించుకుని ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తోంది. మొత్తం రూ.25.85 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు శాతం 100 పూర్తి అయింది. స్టేషన్ భవనాన్ని ఆధునిక నమూనాలో అభివృద్ధి చేయడంతో పాటు విస్తృతమైన వేచివుండే గదులు, శుభ్రమైన మరుగుదొడ్లు, మెరుగైన తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రాకపోకలకు సులభతరం చేసే విధంగా ప్లాట్‌ఫార్మ్‌లను విస్తరించారు. అదేవిధంగా డిజిటల్ సూచిక బోర్డులు, సీసీ కెమెరా పర్యవేక్షణ, ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం సౌకర్యాలు కల్పించారు. భద్రత, పరిశుభ్రత, సౌకర్యాల పరంగా స్టేషన్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దారు. ఈ పునరాభివృద్ధితో కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రాంతీయ రవాణా కేంద్రంగా మరింత ప్రాధాన్యం పొందనుంది. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఊతమివ్వనుందని అధికారులు భావిస్తున్నారు.



## యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

**మణికొండలో విషాదం**

**బ్రేకప్ అనంతరం మళ్లీ కలిసిన మాజీ స్నేహితుడు**

**మనస్తాపంతో తీసుకున్న తీవ్ర నిర్ణయం?**



**హైదరాబాద్, ఫిబ్రవరి 25**

మణికొండలోని చిత్రపురి కాలనీలో నివసిస్తున్న యూట్యూబర్ కోమలి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం ప్రకారం, కోమలి మాజీ స్నేహితుడు అఖిల్ రెడ్డి ఆత్మహత్యకు ముందు ఆమె ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఏడాది క్రితం ఇద్దరూ విడిపోయినప్పటికీ, అతడిని వదిలి ఉండలేక కోమలి తిరిగి సంప్రదించి ఇంటికి పిలిచినట్లు సమాచారం. తనతో కలిసి ఉండాలని కోరగా, అఖిల్ నిరాకరించి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత కోమలి తీవ్ర నిరాశకు లోనై ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వ్యక్తిగత సమస్యలు జీవితాన్ని ముగించుకునే స్థాయికి తీసుకెళ్లకూడదని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడటం, అవసరమైతే నిపుణుల సహాయం పొందడం ద్వారా సమస్యలకు పరిష్కారం వెతకాలని సూచిస్తున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## నిర్మలమ్మకు కనిపించని ప్రజా జీవిత వాస్తవాలు

ఈ నెల 1న లోక్‌సభలో 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత ఆ వార్షిక పద్దుపై ప్రభుత్వ ప్రతినిధులు, సంపాదకీయ రచయితలు, ఆర్థిక వ్యవహారాలపై వ్యాఖ్యాతలు, పాత్రికేయులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ‘జాగరూకత’ అనే పదాన్ని, ‘ఉన్న స్థితిని చెదరగొట్టి తలకిందులు చేయవద్దు’ (డోంట్ రాక్ ది బోట్) అనే పదబంధాన్ని ఉపయోగించారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను ఆర్థిక సర్వే 2025--26 గుర్తించింది; అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన సుంకాల సమరం భారత్ సరుకులపై విధించిన 50శాతం సుంకాలను 18శాతానికి తగ్గించనున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ ‘తగ్గింపు’నకు షరతులు ఉన్నట్టుగా కనిపిస్తోంది. భారత్‌కు అమెరికన్ ఎగుమతులపై నయాపైసా సుంకం విధించకపోవడం, సుంకాలేతర అవరోధాలను పూర్తిగా తొలగించడం, 50,000 కోట్ల డాలర్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయడం మొదలైనవి. ఇంకా ఇతర షరతులు ఉండవచ్చు. అయితే ఈ షరతులను పాటించడం భారత్‌కు సాధ్యం కాకపోవచ్చు. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావలసిన స్థాయిలో రావడం లేదు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపుదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. నగదు సమృద్ధిగా ఉన్న భారతీయ వ్యాపారవేత్తలు మదుపు చేసేందుకు సంకోచిస్తున్నారు. పర్యవసానంగా ‘స్థూల స్థిర మూలధన సంచయం’ భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 30శాతంగా మాత్రమే ఉండిపోయింది. నామమాత్ర జీడీపీ వృద్ధిరేటు అసంతృప్తికరంగా ఉన్నది. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ) అనుసరించిన గణన పద్ధతులు, జాతీయ ఖాతాలపై అంతర్జాతీయ సంస్థల సందేహాలతో యథార్థ జీడీపీ వృద్ధిరేట్లపై అనుమానపు నీడలు కమ్ముకున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ నిజ స్థితిగతులను అంచనా వేసేందుకు నామమాత్ర జీడీపీ ఒక మంచి సూచకం. ఇది 2023--24, 2024--25, 2025--26 ఆర్థిక సంవత్సరాలలో వరుసగా 12శాతం, 9.8శాతం, 8శాతం మేరకు పెరిగింది. ఏమైనా వృద్ధి వేగాన్ని కోల్పోతోంది సుమా! నిరుద్యోగిత పెరిగిపోయింది. జూన్ 2025లో యువజనుల నిరుద్యోగిత రేటు 15శాతంగా ఉన్నది. దేశ శ్రామిక జనవాళిలో 21.7శాతం మంది మాత్రమే క్రమబద్ధమైన వేతన ఉద్యోగాలలో ఉన్నారు. లక్షలాది యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారు. ఈ నిరుద్యోగులు స్వయం ఉపాధి వైపునకు మళ్లుతున్నట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తయారీ రంగంలో అగ్రగామి కాకుండా ఏ దేశమూ మధ్య ఆదాయ దేశంగా రూపొందదు. భారతదేశ జీడీపీలో తయారీరంగం వాటా గత పది సంవత్సరాలుగా 15 లేదా 16 శాతంగా మాత్రమే ఉంటోంది. పీఎల్ఐ, ఇతర పథకాలు ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయ్యాయి; ద్రవ్య సమీకరణ బాధాకరంగా మందగించింది. ద్రవ్యలోటు 2025--26లో 4.4 శాతం నుంచి 2026--27లో 4.3శాతానికి తగ్గనున్నది. రెవెన్యూ లోటు 1.5శాతంగా ఉండిపోనున్నది. ఎఫ్ఆర్‌బీఎమ్ లక్ష్యాలను చేరుకునేందుకు 12 లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పట్టవచ్చు. అందుకు మనం భారీ మూల్యమే చెల్లించనున్నాము. ప్రభుత్వ ఆర్థిక సలహాదారు, ఆర్థిక సర్వే మొదటి అధ్యాయంలోనే ‘జాగ్రత్తగా ఉండాలి. అయితే నిరాశావాదం అవసరం లేదు’ అని సూచించారు. ఈ ఆశావహ దృక్పథమే ఆ నివేదిక అంతటా కనిపించింది. మరో అధ్యాయంలో ప్రభుత్వం విశ్వసనీయమైన పద్ధతుల ద్వారా ప్రభుత్వ రుణాలను తగ్గించుకోవాలని, జీడీపీ--రుణాల నిష్పత్తిని కూడా బాగా తగ్గించుకోవాలని సూచించారు. పట్టణీకరణ విషయంలో మెట్రోపాలిటన్ పాలనా వ్యవస్థలను పటిష్ఠపరచాలని, సమృద్ధిగా నిధుల కేటాయింపులతో నగరాలకు ఆర్థిక సాధికారత కల్పించాలని పేర్కొన్నారు. పట్టణీకరణ విషయంలో ఆయన దృక్పథం సాహసోపేతంగా ఉందని చెప్పవచ్చు. 2025--26 ఆర్థిక సంవత్సరపు పన్నుల జూదం విఫలమయింది. గత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ నుంచి డివిడెండ్ రూపంలో ఉదారంగా అందిన దాదాపు రూ.3,04,000 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో అంకెలు ఘనంగా కనిపించేందుకు దోహదం చేశాయి. అంతకు ముందు రెండు ఆర్థిక సంవత్సరాలలో ఆర్బీఐ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్‌గా వరుసగా రూ.2,10,874 కోట్లు, రూ.2,68,590 కోట్లు సమకూరాయి. యూపీఏ ప్రభుత్వాల హయాం (2004--14)లో రిజర్వ్ బ్యాంక్ నుంచి ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో సమకూరిన గరిష్ఠ మొత్తం (2013-14లో) రూ.52,679 కోట్లు. తన ప్రధాన సలహాదారు రూపొందించిన ఆర్థిక సర్వేకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిస్పందన అస్పష్టంగా ఉన్నది. తన 85 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించిగానీ, సుంకాలు, నిర్బంధ వాణిజ్య ఒప్పందాల రూపేణా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ చేస్తోన్న ద్విముఖ దాడి గురించి ఆమె ఎటువంటి వ్యాఖ్య చేయలేదు! అంతకంతకూ మహాశక్తిమంతమవుతోన్న చైనా ఆర్థిక వ్యవస్థ గురించిగానీ, ఆర్థిక వ్యవహారాలపై మెరుగైన అవగాహన ఉన్నవారు బడ్జెట్ నుంచి ఆశిస్తున్న విషయాలపైగానీ ఆమె ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఆర్థిక మంత్రిగానీ, ప్రభుత్వంగానీ ఆర్థిక సర్వేను లెక్కలోకే తీసుకోలేదు-- ఇది నేను ఉదారంగా చేస్తున్న విమర్శ. ‘మనం సౌర వ్యవస్థలోని ఒక గ్రహవాసులమని ప్రస్తుత పాలకులు భావించడం లేదు’ అనేది నేను నిర్దయగా చేసే విమర్శ. మందగించిన వృద్ధిరేటు, పేదరికం, పెరుగుతున్న అసమానతలు, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, సంక్షేమంపై నిర్లక్ష్యం, రూపాయి విలువ తగ్గుదల మౌలిక సదుపాయాలు, అత్యవసర సేవల విషయంలో గిరాకీ, సరఫరాల మధ్య అంతరాలతో దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనుసరించనున్న విధానాలు ఏమిటో ఆర్థికమంత్రి తన ప్రసంగంలో వెల్లడించకపోవడం నన్ను నిర్ఘాంతపరిచింది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగాన్ని ఆర్థికరంగ నిపుణులు తీవ్రంగా విమర్శించారు. భారత్-- ప్రపంచ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్పుకుంటూ ప్రభుత్వం తనను తాను అభినందించుకోవడాన్ని డాక్టర్ సూర్జిత్ భల్లా ఎగతాళి చేశారు. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడాన్ని డాక్టర్ అశోక్ గులాటి గర్హించారు. ఆర్థికమంత్రి తన ప్రసంగంలో అనేక పథకాలు, కార్యక్రమాలు, మిషన్‌లు, సంస్థలు, చొరవలు, ఫండ్స్, కమిటీలను ప్రస్తావించారు.

# మత జాతీయవాదం భారత్‌కు మేలు చేసేనా?

‘పాకిస్థాన్ తన ముస్లిమేతర పౌరులను ఎంతగా దురవస్థలకు గురి చేసినా మనం మన మైనారిటీ మతస్థులపట్ల నాగరీక రీతిలో వ్యవహరించాలి. మన అల్పసంఖ్యాక వర్గాలకు పూర్తి భద్రత కల్పించి, ఒక ప్రజాస్వామిక రాజ్యంలో పౌరులకు ఉండే హక్కులు అన్నిటినీ మన ముస్లిం మైనారిటీలకు ఇవ్వాలి’-- 1947 అక్టోబర్ 15న ముఖ్యమంత్రులకు రాసిన లేఖలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఉద్ఘాటించిన మాటలవి. లౌకికవాదం, మైనారిటీలకు సమానహక్కుల విషయంలో నెహ్రూ నిబద్ధతకు కాంగ్రెస్ పార్టీలోనే సంపూర్ణ ఆమోదం లేదు. స్వతంత్ర భారతదేశ తొలి సంవత్సరాలలోనూ, ఆ తరువాత తన జీవిత పర్యంతం కాంగ్రెస్‌లోనూ, విశాల భారతీయ సమాజంలోనూ మితవాద హిందూ శక్తుల ప్రభావాన్ని సమర్థంగా ప్రతిఘటించేందుకు ప్రధాని నెహ్రూ నిరంతరం కృషి చేశారు. ఆయన మరణానంతర దశాబ్దాలలో మాత్రమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనసంఘ్, ఈ పార్టీ ప్రస్తుత అవతారమైన భారతీయ జనతా పార్టీ తమ ప్రభావ ప్రాబల్యాలను పెంచుకున్నాయి. దేశ విభజన అనంతరం భారత్ లౌకికవాద రాజ్యాంగాన్ని రూపొందించుకుని బహుళత్వ, సమ్మిళిత భారతదేశ నిర్మాణాన్ని లక్ష్యంగా ఔదలదాల్చింది. దేశ పాలనా వ్యవహారాలు మత ప్రమేయం లేకుండా జరిగేందుకు తొలి ప్రధాని నెహ్రూ సుస్థిర పునాదులు వేశారు. అయితే మతాన్ని రాజ్య వ్యవహారాలతో మిళితం చేసిన మార్గాన్ని అనుసరించిన పాకిస్థాన్‌కు భారత్ ఇప్పుడు ఆ విషయంలో చేరువవుతోంది! మెజారిటీవాద ధోరణి ప్రస్తుత పాలకపక్షం వ్యవహారాలలో స్పష్టంగా కనిపిస్తోంది. గత మూడు సార్వత్రక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తరఫున లోక్‌సభకు ఎన్నికైన 800 మందికి పైగా ప్రజా ప్రతినిధులలో ముస్లిం మతస్థులు ఒక్కరూ లేరు! నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ హిందూ ఓటు బ్యాంకును సృష్టించుకోవడంలో చాలావరకు సఫలమయింది. హిందూ ఓటర్ల మద్దతు ఆధారంగా తరచూ ఎన్నికలలో విజయాలు సాధిస్తోంది. హిందువులకే ప్రథమ ప్రాధాన్యమిచ్చే రాజకీయాల అజెండా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పదే పదే అధికారాన్ని కైవసం చేసుకునేందుకు తోడ్పడుతుండడంతో సంఘ్ పరివార్ భారతీయ సమాజంలో తన ప్రభావ ప్రాబల్యాలనూ ఇతోధికంగా పెంపొందించుకుంటోంది. ఈ క్రమంలో భారతీయ ముస్లింలను (అప్పుడప్పుడూ భారతీయ క్రైస్తవులను కూడా) పలు విధాలా వేధింపులకు గురిచేస్తోంది. ఆ మైనారిటీ మతస్థుల పట్ల విద్వేషాన్ని ప్రోత్సహిస్తోంది. ముస్లింలు ఒకప్పుడు కేంద్ర కేబినెట్‌లో ప్రధాన మంత్రిత్వ శాఖలకు సారథ్యం వహించారు. దౌత్య శ్రేణులకు, గూఢచార వర్గాలకు నాయకత్వం వహించారు. భారత ప్రధాన న్యాయమూర్తులుగా దేశ న్యాయపాలనను నిర్దేశించారు. భారత వాయుసేనకు అధినేతలుగా ఉన్నారు. ఇటీవలి కాలంలో అంటే 2014కు పూర్వం నరేంద్ర మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో రెండు నగరాలు పార్లమెంటులో తమ ప్రతినిధులుగా ముస్లింలను ఎన్నుకున్నాయి. మరి ఇప్పుడో? మన ప్రజా జీవితంలో ప్రముఖ స్థానాలలో ఉన్నవారిలో ఒక్క ముస్లిం కూడా లేడు. కాయ కష్టంతో బతికే ముస్లింలను నిత్యం అనేక విధాలుగా అవమానిస్తున్నారు. ముస్లింల భారతీయ పౌరసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు వారి దేశభక్తిని శంకిస్తున్నారు. వారిని లక్ష్యంగా చేసుకుని హింసాకాండకు పాల్పడుతున్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని మూకదాడులు చేస్తున్నారు. న్యాయవిరుద్ధంగా ముస్లింల గృహాలను కూల్చివేస్తున్నారు. లౌకికవాద, బహుళత్వ, సమ్మిళిత ప్రజాస్వామ్యమే భారత్ భావన హృదయం. అయితే పాకిస్థాన్‌కు పునాది అయిన మత జాతీయవాదం ప్రాతిపదికను ప్రాథమికంగా ప్రతిబింబించే ఆధిపత్యవాద రాజ్యంగా భారత్‌ను రూపొందించేందుకు బీజేపీ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయి. జాతి జీవనంలోని వివిధ రంగాలలో ఇది ప్రతీకాత్మకంగాను, ఆచరణాత్మకంగాను కనిపిస్తోంది. పాలకపక్షం మాటలు, చేతలు ఆ లక్ష్య పరిపూర్తిని మరింత త్వరితం చేసేవిగా ఉన్నాయి. హిందూ మెజారిటీవాదం మే 2014 నుంచే ప్రారంభం కాలేదు. దానికి సుదీర్ఘ చరిత్ర ఉన్నది. 19వ శతాబ్దిలో హిందూ మిషనరీ సొసైటీల కార్యకలాపాలు, 20వ శతాబ్దిలో హిందూ మహాసభ రాజకీయాలు, 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భావం ఆ చరిత్రలో భాగాలే. రాజ్య వ్యవహారాలలో మత ప్రమేయం లేకుండా ఉండేందుకు నెహ్రూ నిరంతరం అప్రమత్తంగా ఉండేవారు. అయితే ఆయన మనవడు రాజీవ్‌గాంధీ షా బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఉత్పన్నమైన సంక్లిష్ట రాజకీయ పరిస్థితులలో అనుసరించిన విధానాలు హిందూత్వ శక్తుల ప్రభావశీలత పెరుగుదలకు ఆలంబన అయ్యాయి. పాలనా వ్యవహారాలను మత ప్రాతిపదికన నడపడంతో ముస్లిం మత తీవ్రవాదుల కంటే హిందూ మత తీవ్రవాదులు ఎక్కువగా లబ్ధి పొందారు. రాజీవ్ ప్రభుత్వం అయోధ్యలోని వివాదాస్పద బాబ్రీ మసీదు తాళాలు తెరవడంతో ఆ మసీదును కూల్చివేసి దాని స్థానంలో రామాలయాన్ని నిర్మించేందుకు సంఘ్ పరివార్ దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించింది. 1984 సార్వత్రక ఎన్నికలలో కేవలం రెండే రెండు స్థానాలలో గెలిచిన బీజేపీ దశాబ్దన్నర కాలంలో దేశంలో అగ్రగామి జాతీయ రాజకీయ పక్షంగా ఆవిర్భవించింది. బీజేపీ ప్రథమ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి పాలనా శైలిలో మెజారిటీవాద ప్రేరణలు ఉండేవి కావు. ఆయన పార్టీ అనేక సంకీర్ణ భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయవలసి ఉండడంతో ఆయన సంయమనంతో వ్యవహరించేవారు. సార్వత్రక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు మంచి మెజారిటీతో విజయం సాధించిన బీజేపీ రెండో ప్రధానమంత్రి, మూడోసారి సాధారణ మెజారిటీని సాధించుకోలేకపోయినప్పటికీ పాలనా వ్యవహారాలలో ‘హిందువులకే ప్రథమ ప్రాధాన్యం అజెండా’ను అమలుపరుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రథమ కుటుంబంలోని ప్రస్తుత తరం నాయకుల కంటే బీజేపీ అగ్రనాయక ద్వయం నరేంద్రమోదీ, అమిత్ షాలే మరింతగా సైద్ధాంతిక నిబద్ధులు. అంతేకాదు, అధికారాన్ని గెలుచుకోవడం పైన, గెలుచుకున్న అధికారాన్ని నిలబెట్టుకోవడం పైన కాంగ్రెస్ నేతల కంటే వీరే ఎక్కువ దృష్టి పెడుతున్నారు. మోదీ--షా ద్వయంతో పోలిస్తే రాజకీయాలలో రాహుల్, ప్రియాంకల ఆసక్తి, నిమగ్నత అస్థిరమైనది, అవ్యవస్థితమైనది. కాంగ్రెస్ కృశించి, క్షీణించిపోతుండగా, సంఘ్ పరివార్ ప్రభావ ప్రాబల్యాలు క్రమంగా పెరిగాయి, మరింతగా బలీయమవుతూ విస్తరిస్తున్నాయి. భారతదేశ నడుస్తున్న చరిత్రలో సువ్యక్తమవుతున్నది ‘నాగరికతా పునరుజ్జీవనమే’నని హిందూ మితవాద సైద్ధాంతికులు తరచూ పెద్ద పెట్టున వాదిస్తున్నారు. ఈ వాదనలో ఇసుమంత సత్యం కూడా లేదు. భారతీయ కళలు, సంగీతం లేదా తాత్త్విక చింతనా ధోరణులు మహోన్నతమైనవి. వాటిని సమకాలీన ప్రపంచ సమస్యల పరిష్కారానికి వాటిని మరింత ఉపయుక్తంగా చేసే విషయంలో సంఘ్ పరివార్‌కు ఎటువంటి శ్రద్ధ లేదు. వారి శ్రద్ధాసక్తులు వేరే విషయాలలో ఉన్నాయి. హిందువులు కాని ఇతర భారతీయులు, ముఖ్యంగా ముస్లింల కంటే హిందువులే సమస్త జీవన రంగాలలోను అన్ని విధాల ఆధిక్యులు అన్న విషయాన్ని పదే పదే ప్రకటించడంపైన మాత్రమే శ్రద్ధ చూపుతున్నారు. నిజానికి మనం ఇప్పుడు చూస్తున్నది నాగరికతా పునరుజ్జీవనం కాదు. హిందూత్వ అజెండా ప్రేరేపిత కార్యాచరణే. నడుస్తున్న కాలంలో, మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈ 2026లో భారత్ ఒక హిందూ పాకిస్థాన్‌గా ప్రభవించే సూచనలు సర్వత్రా కనిపిస్తున్నాయి. ఈ పరిణామాన్ని నివారించడం సాధ్యమవుతుందా? లౌకిక, మతపరమైనది కాని రాజ్యవ్యవస్థ భవిష్యత్తులో భద్రంగా వర్ధిల్లుతుందా? సమాధానాలు చెప్పడం అసాధ్యమైన ప్రశ్నలివి. అయితే ఇతర దేశాల అనుభవాలను పరిశీలించినప్పుడు మత విశ్వాసాలను రాజ్య వ్యవహారాలతో మిళితం చేయడమనేది ఎక్కడా సత్ఫలితాలనివ్వలేదని స్పష్టమవుతుంది. పాకిస్థాన్ తన అస్తిత్వానికి ఇస్లాంను కేంద్రంగా చేసుకున్నది. ఇది ఆ దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రజాస్వామ్య పాలనా పురోగతికి తీవ్ర విఘాతం కలిగిస్తోంది. లౌకికవాద ఆదర్శాలు పునాదిగా ప్రభవించిన బంగ్లాదేశ్ ఆ ఆదర్శాలను త్యజించింది. ఫలితంగా సంక్షోభం పాలై పలు విధాలా నష్టపోతోంది. ఒక అభివృద్ధి చెందిన దేశంగా వర్ధిల్లేందుకు ఆవశ్యకమైన ఆర్థిక, సాంస్కృతిక వనరులు ఇరాన్‌కు ఉన్నాయి. అయితే 1979లో మత ఛాందసవాద అయతొల్లాలు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలు వమ్మయిపోయాయి.

# తరచూ బీర్ తాగుతున్నారా..? ఎన్ని అనర్థాలు సంభవిస్తాయో తెలుసా..?



వీకెండ్ వచ్చిందంటే చాలు యువత ఎక్కువగా బీర్ తాగుతూ వీకెండ్ వైబ్స్‌ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. బీర్ తాగడం సరదగా ఉన్నప్పటికీ ఇది మన ఆరోగ్యానికి గణనీయమైన హానిని కలిగిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చాలా మంది బీరే కదా అని తేలికగా తీసుకుంటూ ఉంటారు. కానీ బీర్ లో కూడా ఆల్కహాల్ ఉంటుంది. ఇది మన ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. బీర్ తాగడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. ఎముకలు బలహీనంగా తయారవుతాయి. 35 సంవత్సరాలు దాటిన తరువాత ఎముకల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళలు బీర్ తాగడం వల్ల హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తుతాయి. నెలసరి సమస్యలు రావడం, మానసికపరమైన సమస్యలు రావడం జరుగుతుంది. పురుషులు బీర్ తాగడం వల్ల వారిలో ఛాతి పెరుగుతుంది. టెస్టోస్టెరాన్ స్థాయిలు తగ్గి ఈస్ట్రోజన్ స్థాయిలు పెరుగుతాయి. అంతే కాకుండా శరీరం శక్తి, పనితీరుతో పాటు ఆత్మవిశ్వాసం కూడా తగ్గుతుంది. బీర్ తాగడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య కూడా తలెత్తుతుంది. చాలా మంది బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నామని భావిస్తూ ఉంటారు. కానీ బీర్ వల్ల మన ఆరోగ్యానికి కలిగే హాని గురించి ఎవరూ ఆలోచించరు అని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా బీర్ తాగడం వల్ల మూత్రవిసర్జన పెరుగుతుంది. దీంతో శరీరం డీహైడ్రేషన్ బారిన పడుతుంది. తలతిరగడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ లో ఉండే ఆల్కహాల్ పేగులో ఉండే పొరలను చికాకుకు గురి చేస్తుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు అధికం అవుతాయి. ఆమ్లత్వం పెరగడంతో పాటు పొట్టలో పుండ్లు కూడా ఏర్పడతాయి. బీర్ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీర్ఘకాలం పాటు బీర్ తాగడం వల్ల సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, ఆల్కహాలిక్ హెపటైటిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కాలక్రమేణా మెదడు పనితీరు కూడా దెబ్బతింటుంది. అభిజ్ఞా పనితీరు క్షీణించడం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ తాగడం వల్ల గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. కనుక బీర్ ను తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. బీర్ తాగే అలవాటును ఒక్కసారిగా మానేయలేని వారు ఈ అలవాటును క్రమంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. బీర్ వంటి ఆల్కహాల్ కలిగిన పానీయాలను ఆరు నెలల పాటు తీసుకోకపోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంలో పెద్ద మార్పులను చూడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. బీర్ ను మానేయడం వల్ల మనం అనేక ఆరోగ్యప్రయోజనాలను పొందవచ్చని మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు చెబుతున్నారు.




## నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా

### తాప్సీ సెటైరికల్ కామెంట్స్ వైరల్

సౌత్ నుంచి బాలీవుడ్ వరకు వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి తాప్సీ పన్ను మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2010లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన ఝుమ్మంది నాదం సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఆమె, 'మిస్టర్ పర్ఫెక్ట్', 'వీర', 'మొగుడు', 'దరువు', 'షాడో', 'గుండెల్లో గోదారి' వంటి చిత్రాల్లో నటించారు. అయితే తెలుగులో ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోవడంతో బాలీవుడ్‌పై దృష్టి సారించారు. హిందీ చిత్రసీమలో మాత్రం తాప్సీ తన కెరీర్‌ను పూర్తిగా మలుచుకున్నారు. గ్లామర్ పాత్రలకు భిన్నంగా కథా ప్రాధాన్యత గల పాత్రలను ఎంచుకుంటూ నటనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా పింక్, నామ్ శభాన, థప్పడ్, ముల్క్ వంటి సినిమాలతో ఆమె నటిగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను ఎంచుకోవడం ఆమె ప్రత్యేకతగా మారింది. ఇటీవల ఓ ప్రముఖ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాపిడ్ ఫైర్ రౌండ్‌లో "మీకు ఇష్టమైన రాజకీయ నాయకుడు ఎవరు? నరేంద్ర మోదీనా? లేక రాహుల్ గాంధీనా?" అనే ప్రశ్న ఎదురవ్వగా తాప్సీ నవ్వుతూ మోదీ ఫోటో వైపు చేతులు జోడించి నమస్కారం చేశారు. వెంటనే "నాకు ఇంకా ఈ దేశంలోనే ఉండాలని ఉంది" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. కొందరు ఆమె చమత్కారాన్ని మెచ్చుకుంటూ స్మార్ట్‌గా హ్యాండిల్ చేసిందని అభిప్రాయపడుతుండగా, మరికొందరు ఈ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో విశ్లేషిస్తూ ట్రోలింగ్‌కు దిగుతున్నారు. అభిమానులు మాత్రం తాప్సీ ఎప్పటిలాగే బోల్డ్‌గా మాట్లాడిందని ఆమెకు మద్దతు ఇస్తున్నారు. ఇక గతంలో కూడా తాప్సీ టాలీవుడ్‌పై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తెలుగులో హీరోయిన్‌లకు సరైన ప్రాధాన్యం ఉండదని, మహిళా పాత్రలకు కథలో బలం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. తాజాగా "నేను ఇండియాలోనే ఉండాలనుకుంటున్నా" అన్న ఒక్క మాటతో మళ్లీ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చారు. ఆమె కామెంట్స్‌పై ఇంకా చర్చ కొనసాగుతూనే ఉంది.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రమోషన్స్ జోరు...

### రెండో పాట రిలీజ్ డేట్ అనౌన్స్ చేసిన చిత్రబృందం




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ -- హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.

## థియేటర్లలో ఫట్, ఓటీటీలో హిట్ ..

### బాలయ్య 'అఖండ 2' నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్



నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన తాజా చిత్రం అఖండ 2 థియేటర్లలో ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా, ఓటీటీ వేదికపై మాత్రం సరికొత్త విజయగాథను రాస్తోంది. మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఆదిపినిశెట్టి, సంయుక్త, పూర్ణ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటించగా, 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ సినిమాను నిర్మించారు. శివతత్వం ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం గత ఏడాది డిసెంబర్ 12న విడుదలైంది. అసలు డిసెంబర్ 5న రావాల్సిన ఈ సినిమా ఆర్థిక కారణాల వల్ల వారం రోజుల వాయిదాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే విడుదల ఆలస్యం, కథనంలో ఎక్కువగా ఆధ్యాత్మిక బోధనలు ఉండటం, 'అఖండ' స్థాయి ఎమోషన్ మిస్ కావడం వంటి కారణాలతో ఈ చిత్రం థియేటర్లలో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. విమర్శకుల నుండి కూడా మిశ్రమ స్పందన రావడంతో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అయితే ఇదే సినిమా ఓటీటీలో మాత్రం ఊహించని రీతిలో పుంజుకుంది. ప్రముఖ స్ట్రీమింగ్ వేదిక చీవ్‌టశ్రీఅఇ లో జనవరి 9 నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం ప్రారంభంలో పెద్దగా గుర్తింపు పొందకపోయినా, క్రమంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటూ ట్రెండ్‌లోకి వచ్చింది. ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా శివభక్తి నేపథ్యం ఉండటంతో ప్రేక్షకులు ఈ సినిమాను ఎక్కువగా వీక్షిస్తున్నట్లు ట్రెండ్స్ సూచిస్తున్నాయి. ఇండియా వైడ్‌గా నెట్‌ఫ్లిక్స్ టాప్ 10 మూవీస్ జాబితాలో ఈ చిత్రం తొమ్మిదో స్థానంలో నిలవడం విశేషం. ఓటీటీలోకి వచ్చి నెల రోజులు దాటిన తర్వాత కూడా ట్రెండింగ్‌లో ఉండటం సినిమా పట్ల ప్రేక్షకుల ఆసక్తిని తెలియజేస్తోంది. థియేటర్లలో నిరాశపరిచిన సినిమా ఓటీటీలో విజయాన్ని అందుకోవడం అరుదైన విషయమేనని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ ఇండియా టాప్ 10 జాబితాలో ఇతర చిత్రాలు, షోలు కూడా పోటీగా ఉన్నప్పటికీ 'అఖండ 2' తన ప్రత్యేక శివతత్వ కంటెంట్‌తో నిలదొక్కుకుంటోంది. ఆలస్యంగా అయినా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతూ డిజిటల్ వేదికపై బాలయ్య సినిమా మరోసారి తన మార్క్ చూపిస్తోందని చెప్పవచ్చు.

## మెగా మూవీలో చాన్స్?

మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న అనస్వర రాజన్.. 'చాంపియన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది. ప్రస్తుతం భాషలకు అతీతంగా సినిమాలు చేస్తూ ఈ మలయాళభామ చాలా బిజీగా ఉంది. ఈ క్రమంలో ఈ టాలెంటెడ్ యాక్ట్రస్‌కి టాలీవుడ్‌లో మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఇన్‌సైడ్ టాక్. చిరంజీవి కథానాయకుడిగా కేవస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. తండ్రీకూతుళ్ల అనుబంధమే ప్రధాన ఇతివృత్తంగా సాగే పవర్‌ఫుల్ కథతో తెరకెక్కనున్న ఈచిత్రంలో చిరంజీవి కూతురు పాత్రకు చాలామంది యంగ్ క్రేజీ కథానాయికలను అనుకున్నారు. అయితే.. ఆ అవకాశం చివరకు అనస్వర రాజన్‌ని వరించిందని తెలిసింది. కూతురు పాత్రకు ఈ కథలో అత్యంత ప్రాధాన్యత ఉండటంతో ఈ బరువైన పాత్రకు అనస్వరరాజన్ అయితేనే న్యాయం చేకూర్చగలదని దర్శకుడు బాబీ భావించారట. త్వరలోనే టీమ్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

